క్లుప్తంగా

ఏపీ దేవ బ్రాహ్మణ పండిత పరిషత్ ఉపాధ్యక్షునిగా బ్రహ్మం

చల్లపల్లి: చల్లపల్లికి చెందిన సిద్ధాంతి జక్కల తారక బ్రహ్మం ఆంధ్రప్రదేశ్ దేవ బ్రాహ్మణ పండిత పరిషత్ ఉపాధ్యక్షునిగా ఎన్నికయ్యారు. చీరాలలోని సాయిబాబా కల్యాణ మండపంలో గురువారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆయన్ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తనపై నమ్మకముంచి రాష్ట్ర బాధ్యతలు అప్పగించిన కమిటీ సభ్యులకు తారక బ్రహ్మం కృతజ్ఞతలు తెలిపారు. సంఘం అభివృద్ధికి తనవంతు కృషిచేస్తానని చెప్పారు.

ఐదుగురు జూదరుల అరెస్ట్

చల్లపల్లి: పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తుల్ని అరెస్టు చేసి వారి నుంచి రూ.41650 నగదు, ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ పీఎస్‌వీ సుబ్రహ్మణ్యం శుక్రవారం తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం గురువారం రాత్రి స్థానిక వైశ్య బజారులోని ఓ ఇంట్లో జూదం ఆడుతున్నట్లు సమాచారం అందుకుని డీఎస్పీ టి.విద్యశ్రీ నేతృత్వంలో దాడి చేసినట్లు చెప్పారు.

నందమూరులో కేంద్ర బృందం సభ్యుడు పర్యటన



పెడన: మండల పరిధిలోని నందమూరు గ్రామంలో శుక్రవారం స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్–2025కు సంబంధించిన కేంద్ర బృందం సభ్యుడు పి.సందీప్ పర్యటించారు. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రం తదితర వాటి పరిసరాలను పరిశీలించారు. అనంతరం వ్యక్తిగత మరుగుదొడ్ల వినియోగం, చెత్త సంపద కేంద్రాలను పరిశీలించారు. ఆయనతో పాటు డెప్యూటీ ఎంపీడీవో ఎం.నాగిరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, వెలుగు సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

ఘనంగా శ్రావణమాస పూజలు ప్రారంభం



కృత్తివెన్ను: శ్రావణమాసం తొలి శుక్రవారం పూజలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మండలంలోని నీలిపూడి, అడ్డపర్ర, లక్ష్మీపురం గ్రామాలలోని కనకదుర్గమ్మ ఆలయాల్లో, నీలిపూడి శ్రీ మహాలక్ష్మీ ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. పెద్ద సంఖ్యలో మహిళలు ఆలయాలను సందర్శించి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు.

గుడ్, బ్యాడ్ టచ్‌పై విద్యార్థినులకు అవగాహన

చల్లపల్లి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం గుడ్ అండ్ బ్యాడ్ టచ్‌పై విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించారు. చల్లపల్లి పోలీస్ శాఖ, శక్తి టీమ్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సీఐ కె.ఈశ్వరరావు మాట్లాడుతూ పిల్లలు ఈవ్‌టీజింగ్, చెడు స్నేహాలు, నిషేధిత వస్తువుల వాడకం వంటి వాటికి దూరంగా ఉండాలని సూచించారు. ఎస్‌ఐ పీఎస్‌వీ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఏదైనా సమస్య ఎదురైనప్పుడు టోల్‌ఫ్రీ నంబర్లు 112కి గానీ, 1930కి గానీ డయల్‌చేసి ఫిర్యాదు చేయాలని చెప్పారు.

బల్లిపర్రు గురుకులంలో ఖాళీల భర్తీకి అవకాశం

పెడన: మండల పరిధిలోని బల్లిపర్రు సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల పాఠశాలలో ఐదవ తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ఖాళీలను భర్తీ చేయడానికి అర్హుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఎన్.రూతమ్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురుకులంలో చేరడానికి ప్రవేశ పరీక్ష రాసి సీటు రాని విద్యార్థులకు ప్రాధాన్యత ఇస్తామన్నారు. ప్రవేశ పరీక్ష రాయకుండా వచ్చిన వారికి కూడా సీటు ఇస్తామని, ప్రతిభ ఆధారంగానే ఈ సీటు కేటాయిస్తామన్నారు. బల్లిపర్రు గురుకుల పాఠశాలలో దరఖాస్తులు చేసుకునే అవకాశం ఉందని, ఈ అవకాశాన్ని విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ఆమె సూచించారు.

బదిలీపై వెళ్లిన ఉద్యోగులకు సత్కారం



పులిగడ్డ(అవనిగడ్డ): మండల పరిధిలోని పులిగడ్డ గ్రామ సచివాలయంలో ఉద్యోగం చేసి బదిలీపై వెళ్లిన ఐదుగురిని సర్పంచ్ దాసరి విజయ్‌కుమార్ శుక్రవారం ఘనంగా సత్కరించారు. స్థానిక పంచాయితీ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు భార్గవ్, సౌమ్య, శైలజ, ప్రవీణ్, సుగుణను సర్పంచ్‌తో పాటు వైస్ ఎంపీపీ పులిగడ్డ పిచ్చేశ్వరరావు, కార్యదర్శి బి.అనిత సత్కరించారు.

గుల్ల పంపులు, ఇంజన్లే దిక్కు



కోడూరు మండలం నారేపాలెంలో నారుమడికి గుల్లపంపుతో నీరు తోడుకుంటున్న రైతు



విశ్వనాథపల్లిలో నాటుకు వచ్చినా ఇంకా తడవని పంటపొలాలు

- పంటకాలువలు ఫుల్
- అయినా నారుమళ్లకు నీరందక ఇబ్బందులు
- పెరిగిపోతున్న ఖర్చులు

అవనిగడ్డ: దివిసీమలో పలు ప్రాంతాల్లో నారుమళ్లకు సాగునీరందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కోడూరు, నాగాయలంక, అవనిగడ్డ మండలాల్లోని తీర ప్రాంతాలకు సక్రమంగా సాగునీరందడం లేదు. దీంతో ఈ ప్రాంతాల్లోని రైతులు నారుమళ్లను రక్షించుకునేందుకు గుల్లపంపులు, ఆయిల్ ఇంజన్లపై ఆధారపడుతున్నారు. ప్రతిరోజూ గుల్లపంపు, ఆయిల్ ఇంజన్లతో నీటిని తోడేందుకు రోజుకు రూ.500 నుంచి రూ.1,000 ఖర్చు అవుతున్నాయని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

దాదాపు లక్ష ఎకరాల్లో వరి సాగు

నియోజకవర్గంలో ఈ ఖరీఫ్‌లో 98,600 ఎకరాల్లో వరిసాగు చేసేందుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. ఘంటసాల, చల్లపల్లి, మోపిదేవి మండలాల్లో వరినాట్లు ఊపందుకోగా, కోడూరు, నాగాయలంక, అవనిగడ్డ మండలాల్లో రైతులు ఇప్పుడే నారుమళ్లు పోస్తున్నారు. పంటకాలువకు సరిగా సాగునీరందక పోవడంతో నారుమడిని తడిపేందుకు గుల్లపంపు, ఆయిల్ ఇంజన్లను ఆశ్రయిస్తున్నారు. ఉదయం మడికి నీరు పెడితే సాయంత్రానికి ఏమీ ఉండటం లేదని, వీటికోసం కూలీ ఖర్చులు పెరిగిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.



పులిగడ్డ వద్ద నిండుగా పంట కాలువ

ఇప్పుడే ఇలా ఉంటే...

నారుమళ్లకే సాగునీరందక పోతే రేపు నాట్లు వేసేందుకు ఏం చేయాలో పాలుపోవడంలేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. నాట్లు వేసేందుకు పొలాలు తడపాలంటే ఇంకా ఖర్చులు పెరిగిపోతాయంటున్నారు. నారుమడికి అయితే ఒక గంట తోడితే సరిపోతుందని, పొలం మొత్తం తోడాలంటే చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని వాపోతున్నారు. పంటకాలువలు ఫుల్‌గా ఉన్నా సాగునీరు ఎందుకు అందడం లేదో అర్థం కావడం లేదంటున్నారు. అరకొరగా పడుతున్న వాన తుంపర్లు ఎందుకూ ఉపయోగపడటం లేదని, నాట్లు వేసే సమయానికైనా సక్రమంగా సాగునీరందించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఇన్‌చార్జిల పాలనతో ప్రజల ఇక్కట్లు

- 8 నెలలుగా తహసీల్దార్ పోస్టు ఖాళీ
- ఏడాదిగా రెగ్యులర్ సర్వేయర్ లేరు
- 10 నెలలుగా భర్తీ చేయని ఎంపీడీఓ పోస్టు
- రైతులకు ప్రధానమైన వ్యవసాయం, నీటిపారుదల, పశుసంవర్థక శాఖల అధికారులు సైతం లేరు

బంటుమిల్లి: మండల పరిధిలోని ప్రభుత్వ కార్యాలయాల్లో పూర్తి స్థాయి అధికారుల నియామకాలు జరగనందున ఇన్‌చార్జిలతోనే నెలల తరబడిగా పరిపాలన కొనసాగిస్తున్నారు. ఈ కారణంగా అధికారులు సమయానికి అందుబాటులో లేక రైతులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పలువురు అధికారులు అదనపు బాధ్యతలతో ఫోన్లోనే సూచనలు, సలహాలు ఇస్తున్నారు. కోర్టు పరిధిలో వివాదం కారణంగా తహసీల్దార్ పోస్ట్ 8 నెలలుగా భర్తీ కాలేదు. రెవెన్యూ శాఖలో తహసీల్దార్ తర్వాత గ్రామ సమస్యలు పరిష్కరించాల్సిన రెవెన్యూ ఇన్‌స్పెక్టరు, సీనియర్ అసిస్టెంటు పోస్టులు రెండు నెలలుగా ఒక్కరే నిర్వహిస్తున్నారు. ఇక్కడ పనిచేస్తున్న ఆర్‌ఐ తన పలుకుబడితో బందరు డెప్యూటేషన్‌పై వెళ్లగా జీతం మాత్రం బంటుమిల్లి నుంచే ఇస్తున్నారు. మండలంలో ప్రజలకు, రైతులకు ప్రధాన సమస్య అయిన సర్వే వివాదాలు దాదాపు సంవత్సర కాలంగా రెగ్యులర్ సర్వేయరు లేక నత్త నడకన జరుగుతున్నాయి. రెవెన్యూ తర్వాత ప్రభుత్వ సంక్షేమ పథకాలను పర్యవేక్షించాల్సిన ఎంపీడీఓ బదిలీపై వెళ్లి దాదాపు 10 నెలలు అవుతోంది. దీని వలన ప్రస్తుతం విధుల్లో ఉన్న అధికారులు కాన్ఫరెన్స్‌లకు, ప్రభుత్వం కేటాయిస్తున్న అదనపు పనులకు పరిమితం అవుతున్నారు తప్ప గ్రామాలలో పర్యటించడం లేదన్న ఆరోపణలున్నాయి. మండలంలో సార్వా సీజన్ మొదలై నెల రోజులు దాటుతోంది. రైతులకు సంబంధించిన ముఖ్యమైన శాఖలైన వ్యవసాయం, ఇరిగేషన్, పశుసంవర్థక అధికారులు బదిలీపై వెళ్లిపోయారు. ఈ స్థానాల్లో ఇన్‌చార్జిలతోనే సరిపుచ్చుతున్నారు. ఏడీఏ ఉన్నా ఆమెకు మచిలీపట్నం అదనపు బాధ్యతలు అప్పగించడంతో 5(బంటుమిల్లి, కృత్తివెన్ను, పెడన, గూడూరు, మచిలీపట్నం) మండలాలను పర్యవేక్షించాల్సి రావడంతో ఆఫీసుకు రావడం గాని, రైతులతో మాట్లాడిన దాఖలాలు కనిపించడం లేదు. వ్యవసాయ సంబంధిత సూచనలు, సలహాలు ఫోన్లోనే ఇస్తున్నారని రైతులు తెలిపారు. ఇటీవల నీటి ఎద్దడి తలెత్తితే రైతులు తమ సమస్యలను లస్కర్ల వద్దనే మొరపెట్టుకున్నారు. పశుసంవర్థక శాఖ ఆధ్వర్యంలో బంటుమిల్లిలో ఏడీ స్థాయి పర్యవేక్షణలో బంటుమిల్లి, కృత్తివెన్ను రెండు మండలాల్లో ఆరు ఆసుపత్రులు ఉంటే వాటిలో ముగ్గురు డాక్టర్లు మాత్రమే ఉన్నారు. బంటుమిల్లి ఏడీ తన పలుకుబడితో విజయవాడ డెప్యూటేషన్‌పై వెళ్లి జీతం ఇక్కడే తీసుకుంటే పెడన ఏడీకి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ రెండు మండలాల్లోను వందలాది పశువులకు, వేలాది జీవాలకు ముగ్గురు డాక్టర్లు, అంబులెన్స్, వెటర్నరీ అసిస్టెంట్లు, గోపాలమిత్రలు సచివాలయ సిబ్బందే వైద్య సేవలకు దిక్కు. ఇక పంచాయతీరాజ్ ఆధ్వర్యంలో జరుగుతున్న నిర్మాణాలను ఇన్‌చార్జి ఏఈఈనే 5 నెలలుగా పర్యవేక్షిస్తుండటంతో పనులను వర్క్ ఇన్‌స్పెక్టర్లే దగ్గర ఉండి చేయిస్తున్నారు. ఇక సివిల్, ఎక్సైజ్ పోలీసు శాఖల్లో పరిస్థితి మరీ దారుణంగా ఉంది. కాపుసారాకు ప్రధాన సర్కిల్‌గా పేరున్న బంటుమిల్లి సర్కిల్ పర్యవేక్షణకు ఒక సీఐ, ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్లు, ఒక కానిస్టేబుల్ మాత్రమే పనిచేస్తున్నారు. సర్కిల్ పరిధిలో బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాలు ఉన్నాయి. ఈ మండలాల్లో పలు గ్రామాల్లో కాపుసారా తయారీదారులు ఎక్కువగా ఉన్నారు. రెండు మండలాల్లో 8 మద్యం దుకాణాలను కూడా పర్యవేక్షించాల్సి ఉంది. ఇవి కాక మండలంలో 21 గ్రామ పంచాయతీలు, 80 శివారు గ్రామాల్లో బెల్ట్‌షాపు లేని గ్రామం లేదంటే అతిశయోక్తికాదు. గ్రామాల్లో కాపుసారా తయారు కాకుండా బెల్ట్ షాపులు పాడుకున్న, తీసుకున్న నిర్వాహకులే కాపలా కాసుకుంటున్నారు. సివిల్ పోలీసుల పరిస్థితి అలాగే ఉంది. స్టేషన్‌లో ఎస్‌ఐతోపాటు ఒక ఏఎస్‌ఐ, ముగ్గురు హెచ్‌సీలు, 18 మంది పీసీలు ఉండాలి. కాని ఒక ఎస్‌ఐ, ఒక హెడ్ కానిస్టేబులు, కొద్ది మంది కానిస్టేబుళ్లతో కాలం వెళ్లబుచ్చుతున్నారు. దీంతో హోంగార్డులపై అదనపు భారం పడుతోంది.



ఖాళీగా ఉన్న పశుసంవర్థక శాఖ ఏడీ కుర్చీ

రైతుల ఇబ్బందులు పట్టించుకునేవారులేరు



ముమ్మరంగా వ్యవసాయ పనులు జరుగుతున్న క్రమంలో సూచనలు, సలహాల కోసం రైతులు తీవ్ర అసౌకర్యాన్ని ఎదుర్కొంటున్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి అధికారుల నియామకం చేయాలి.

–గొరిశెట్టి నాగేశ్వరరావు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి, బంటుమిల్లి

యూరియా మోతాదుకు మించి రైతులకు ఇవ్వొద్దు

పెడన: రైతులకు యూరియా ఎకరానికి ఒక బ్యాగ్ మించి ఇవ్వొద్దని, మొదటి డోస్ కాబట్టి ఎకరానికి ఒక బ్యాగ్ అంటే 45 కేజీలు వినియోగిస్తే సరిపోతుందని పెడన ఏవో సజ్జా జెన్నీ స్పష్టం చేశారు. శుక్రవారం ఆమె తన చాంబరులో మండలంలోని పీఏసీఎస్‌లకు చెందిన కార్యదర్శులతో యూరియా నిల్వలు, దిగుమతులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం ఎక్కడెక్కడ యూరియా నిల్వలున్నాయి, లేనిదీ అడిగి తెలుసుకున్నారు. పెడన, నందమూరు పీఏసీఎస్‌లలో తప్ప మిగిలిన పీఏసీఎస్‌లలో ఎక్కడా యూరియా లేదని కార్యదర్శులు ఏవోకు తెలియజేశారు. ఇప్పటికే ఇండెంట్‌లు పెట్టామని, శనివారం లోడ్ వస్తుందని ఏవోకు వివరించారు. అయిపోయే పరిస్థితిని ముందుగానే గుర్తించి దిగుమతి అయ్యేలా చూసుకోవాలని, రైతులకు ఎకరానికి ఒక బస్తా మించి ఇవ్వొద్దని తెలిపారు. ఏ మాత్రం యూరియా పంపిణీ విషయంలో పొరపాట్లు జరిగినా ఊరుకునేది లేదన్నారు. అవసరమైతే ఆయా పీఏసీఎస్‌లు వద్ద వీఏఏలను ఉంచుతామని ఆమె వారికి తెలియజేశారు.



పీఏసీఎస్ కార్యదర్శులతో యూరియాపై మాట్లాడుతున్న ఏవో జెన్నీ

ఈద్గా పునఃనిర్మాణానికి వినతి



గూడూరు: ఇటీవల కురిసిన వర్షాలకు గూడూరులో కూలిపోయిన ఈద్గా పునఃనిర్మాణానికి ప్రభుత్వపరంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ ముస్లిం నాయకులు శుక్రవారం గూడూరు తహసీల్దారు డి.రాజ్యలక్ష్మికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత వారం రోజులుగా ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు ఈద్గా కూలిపోయిందన్నారు. రంజాన్, బక్రీద్ పర్వదినాలలో ముస్లింలు ఈద్గాలో ప్రత్యేక ఈద్ ప్రార్థనలు నిర్వహించడం సంప్రదాయం అని, ఈద్గా కూలిన ఘటనపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, ప్రభుత్వం ద్వారా పునఃనిర్మాణం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

క్రమశిక్షణతో విద్యనభ్యసించాలి

పెడన: విద్యార్థులు విద్య పట్ల ఆసక్తి కలిగి ఉండాలని, క్రమశిక్షణతో అభ్యసించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కేవీ రామకృష్ణయ్య అన్నారు. పట్టణంలోని బీసీ బాలురు, బాలికల కళాశాల వసతి గృహాలలో విద్యార్థులకు న్యాయసేవాధికారతపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న న్యాయమూర్తి రామకృష్ణయ్య మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకోవాలని, చెడు వ్యసనాల జోలికి పోవద్దన్నారు. మత్తు పదార్థాలను తీసుకోవద్దని, కొత్త వ్యక్తులు ఏమైనా ఇచ్చినా వాటిని తీసుకోకూడదన్నారు. తల్లిదండ్రులు ఎంతో బాధ్యతతో మిమ్మల్ని వసతి గృహాల్లో ఉంచి చదువుకోవాలని చెబుతారని, వారి మాటలను పెడచెవిన పెట్టకుండా బాగా చదువుకుని వారికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో న్యాయవాదులు చీలి మునలయ్య, జి.శ్రీనివాస్, ట్రైనీ ఎస్‌ఐ నాగరాజు, ఆయా వసతి గృహాల వార్డెన్లు రవి, ప్రభాకర్, మేరీశోభాలత, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులకు దుప్పట్లను అందజేశారు.



విద్యార్థులకు దుప్పట్లు అందజేస్తున్న జడ్జి రామకృష్ణయ్య

ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ

బొబ్బర్లంక(మోపిదేవి): ప్రకృతి వ్యవసాయంపై రైతులు మక్కువ చూపాలని అవనిగడ్డ డివిజన్ ఏడీఏ జయప్రద తెలిపారు. మండలంలోని బొబ్బర్లంక గ్రామంలో శుక్రవారం ప్రకృతి వ్యవసాయంపై వీఏఏలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ కషాయాలు, ద్రావణాలు, గ్రోత్ ప్రమోటర్స్ తయారీ విధానాన్ని వివరించారు. ఈ సందర్భంగా బీజామృతం, ధ్రువ జీవామృతం, నీమాస్త్రం, బ్రహ్మాస్త్రం, సప్తధన్యాంకుర, కోడిగుడ్డు నిమ్మరసం ద్రావణం, పంచగవ్యం తయారుచేసి చూపించారు. అడిషనల్ డీపీఎం నాగమల్లేశ్వరి, హెచ్‌ఆర్ కృష్ణార్జున, మూడు మండలాలకు చెందిన ఏవోలు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.



బొబ్బర్లంకలో బీజామృతం చేసే విధానంపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

భవనం పైనుంచి పడి సివిల్ ఇంజినీర్ మృతి

బొబ్బర్లంక(మోపిదేవి): మండల పరిధిలోని బొబ్బర్లంక గ్రామానికి చెందిన దొప్పలపూడి జగన్మోహనరావు(మిల్లుబాబు) కుమారుడు, సివిల్ ఇంజినీర్ దొప్పలపూడి బాలకృష్ణ(55) భవనం పైనుంచి కింద పడి అక్కడికక్కడే మృతి చెందారు. కర్నాటక రాష్ట్రంలోని హుబ్లీ ప్రాంతంలో కాంట్రాక్టర్‌గా ఉంటున్న ఈయన హుబ్లీలో గురువారం రాత్రి తన ఇంటి వద్ద భవనంపై ఫోన్ మాట్లాడుతూ ప్రమాదవశాత్తు కింద పడిపోవడంతో తలకు బలమైన గాయమై మృతిచెందారు.

ఆదర్శ గ్రామ పంచాయతీగా ఖ్యాతి పొందాలి

ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

మోపిదేవి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న మోపిదేవి ఆదర్శ గ్రామ పంచాయతీగా ఖ్యాతి పొందాలని అవనిగడ్డ శాసనసభ్యుడు మండలి బుద్ధ ప్రసాద్ అన్నారు. మండల కేంద్రం మోపిదేవిలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.43.60 లక్షలతో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భక్తుల సౌకర్యార్థం ట్రాఫిక్ రద్దీ తగ్గించేందుకు గ్రామానికి మరో రహదారి నిర్మించాల్సి ఉందన్నారు. దేవస్థానం అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ అమలు చేస్తున్నామని, అందులో భాగంగా కోనేరు ఆవరణలో వసతి గదులు, షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేసి ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయన్నారు. అక్కడే టాయిలెట్స్ కాంప్లెక్స్, తలనీలాలు తీయించుకునే రూములు, స్నానాల గదులు కూడా త్వరలోనే నిర్మాణం చేపడతామన్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి నిత్యం వేలాదిగా వచ్చే భక్తులతో పాటు న్యాయమూర్తులు, రాజకీయ ప్రముఖులు వస్తున్న నేపథ్యంలో గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణ సమర్థంగా నిర్వహించాలని సూచించారు. తొలుత గ్రామ సర్పంచ్ నందిగం మేరీరాణి దంపతులు, జెడ్పీటీసీ మెడబలిమి మల్లికార్జునరావు దంపతులు నూతన భవనంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. చివరగా గ్రామ పంచాయతీ ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం ఎమ్మెల్యేను పంచాయతీ పాలకవర్గ సభ్యులు శాలువాతో ఘనంగా సన్మానించారు.



మోపిదేవిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

దళితవాడలో కమ్యూనిటీ భవనం ప్రారంభం

మండలంలోని బొబ్బర్లంక గ్రామంలో నూతనంగా నిర్మించిన కమ్యూనిటీ భవనాన్ని ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ ప్రారంభించారు. గ్రామ సర్పంచ్ నందిగం మేరీరాణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో యువ నాయకుడు మండలి వెంకట్రామ్, ఎంపీపీ రావి దుర్గావాణి, జెడ్పీటీసీ మెడబలిమి మల్లికార్జునరావు, నియోజకవర్గ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు, టీడీపీ, జనసేన మండల పార్టీ అధ్యక్షులు నడకుదుటి జనార్దనరావు, పూషడపు రత్నగోపాల్ పలువురు అధికారులు పాల్గొన్నారు.

పలు దేవాలయాల్లో శ్రావణమాస పూజలు

నాగాయలంక: ఈ ఏడాది శ్రావణ మాసం తొలి రోజే శుక్రవారం పర్వదినం కలసి రావడంతో నాగాయలంక మండలంలోని పలు దేవాలయాల్లో శ్రావణ మాసోత్సవాలు ఉత్సాహంగా ఆరంభమయ్యాయి. మండలంలోని గణపేశ్వరంలో అర్చకుడు పోతుకూచి సత్యనారాయణ శర్మ నేతృత్వంలో శోభాయమానంగా అలంకరించారు. భావదేవరపల్లి శ్రీఅన్నపూర్ణదేవి సమేత శ్రీకాశీవిశ్వేశ్వరస్వామి దేవస్థానంలో ఆకెళ్ల దేవనాథన్ శర్మ బ్రహ్మత్వంలో అన్నపూర్ణ దేవిని, శివలింగాన్ని పసుపు, కుంకుమలతో అలంకరించారు. టి.కొత్తపాలెం గ్రామంలోని శ్రీభ్రమరాంబదేవి సమేత మల్లేశ్వరస్వామి ఆలయంలో అర్చకుడు అంబా సాయికిరణ్‌శర్మ ఆధ్వర్యంలో శ్రావణమాసం తొలిరోజు అమ్మవారికి అభిషేక మహోత్సవం విశేష అలంకరణ నేత్రపర్వంగా జరిపారు. నాగాయలంక లోని శ్రీకన్యకాపరమేశ్వరి, శ్రీవేణుగోపాలస్వామి శ్రీకనకదుర్గమ్మ దేవస్థానాలలో శ్రావణ మాసోత్సవాలు వేడుకగా ప్రారంభించారు.



భావదేవరపల్లిలో పసుపు ముద్దల అలంకారంతో అన్నపూర్ణ, విశ్వేశ్వరస్వామి

జగనన్న కాలనీలలో ట్రాన్స్‌ఫార్మర్లు తొలగించొద్దు

సీపీఎం జిల్లా కార్యదర్శి నరసింహారావు

మచిలీపట్నంటౌన్: కృష్ణాజిల్లా వ్యాప్తంగా ఉన్న 647 జగనన్న కాలనీలలో ఏర్పాటుచేసిన విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు తొలగించేందుకు ట్రాన్స్‌కో సర్వే చేసిందని, వీటిని తొలగించకుండా చర్యలు చేపట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన జారీ చేశారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో జిల్లాలో వేలాది మంది పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చారన్నారు. పలు కాలనీలలో గృహాలను లబ్ధిదారులు నిర్మించుకోలేకపోయారని కొంతమంది మాత్రం గృహాలను నిర్మించుకున్నారన్నారు. ఈ కాలనీలలో తాగునీరు, విద్యుత్, రోడ్లు, డ్రైనేజీ వంటి మౌలిక సదుపాయాలు పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయలేదన్నారు. ఇప్పటికే కాలనీలలో విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేశారని, వీటిని తొలగించేందుకు ట్రాన్స్‌కో అధికారులు సర్వే చేయటం సరైన పద్ధతి కాదని ఆయన విమర్శించారు. కాలనీలలో తాగునీరు, రోడ్లు, డ్రైన్‌లు వంటి మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని కోరారు.

శిక్షణ సద్వినియోగం చేసుకుని ఉపాధి పొందాలి

కేవీకే సమన్వయకర్త డాక్టర్ డి.సుధారాణి

దాలిపర్రు(ఘంటసాల): కృషి విజ్ఞాన కేంద్రంలో మహిళలకు అందిస్తున్న శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుని ఉపాధి పొందాలని కేవీకే సమన్వయకర్త డాక్టర్ డి.సుధారాణి అన్నారు. ఘంటసాల మండలం దాలిపర్రు గ్రామంలో ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వారి ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో మహిళలకు చిరుధాన్యాలతో విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై శిక్షణ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుధారాణి మాట్లాడుతూ చిరుధాన్యాల ఉపయోగాల గురించి వివరించారు. శిక్షణ కార్యక్రమాన్ని మహిళలు వినియోగించుకుని నైపుణ్యం సాధించి కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసుకుని ఉపాధి పొందాలని ఆకాంక్షించారు. కేవీకే గృహ విజ్ఞాన శాస్త్రవేత్త జి.కృష్ణవేణి మాట్లాడుతూ చిరుధాన్యాలతో కలిగే ఆరోగ్య ప్రయోజనాలు, వాటిలో లభించే పోషకాల గురించి తెలియజేశారు. అనంతరం రాగి లడ్డు, రాగి చాక్లెట్ తయారీపై మహిళలకు శిక్షణ ఇచ్చి వారితో తయారు చేయించారు. కార్యక్రమంలో కేవీకే మత్స్యశాస్త్రవేత్త జె.యశ్వంత్ కుమార్, గ్రామ మహిళలు పాల్గొన్నారు.



దాలిపర్రులో చిరుధాన్యాలతో ఉత్పత్తుల తయారీ శిక్షణలో మాట్లాడుతున్న సుధారాణి

సిగ్నల్ డ్రమ్ములతో నిత్యం ట్రాఫిక్ జామ్

పులిగడ్డ(అవనిగడ్డ): వాహనాల వేగాన్ని నియంత్రించి ప్రమాదాలు తగ్గించేందుకు పులిగడ్డ సర్కిల్ వద్ద పోలీసులు ఏర్పాటు చేసిన చర్య వల్ల తరచూ ట్రాఫిక్ జామ్ అవుతోంది. అవనిగడ్డ మండల పరిధిలోని పులిగడ్డ సర్కిల్ వద్ద వాహనాల వేగాన్ని తగ్గించేందుకు పోలీసులు సిగ్నల్ డ్రమ్ములు ఏర్పాటు చేశారు. పులిగడ్డ బస్టాండ్ వద్ద వీటిని ఏర్పాటు చేయడం వల్ల అవనిగడ్డ నుంచి మోపిదేవి వెళ్లే ఆర్టీసీ బస్సులన్నీ డ్రమ్ముల ముందే ఆగుతున్నాయి. వెనుక, ముందు నుంచి కారు కూడా తప్పుకునే అవకాశం లేకపోవడంతో ప్యాసింజర్లను ఎక్కించుకుని కదిలే వరకూ వెనుక ఉన్న వాహనాలు వెళ్లలేక నిత్యం ట్రాఫిక్ జామ్ అవుతోంది. ఈ డ్రమ్ములను కొద్దిగా ముందుకు జరిపితే ఈ సమస్య ఉండదని పలువురు వాహనదారులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



పులిగడ్డ బస్టాండ్ వద్ద బస్సు ఆగడంతో వెనుక నిలిచిపోయిన కార్లు

ఈ-క్రాప్, ఈ-పంట నమోదులో నిర్లక్ష్యం తగదు

పెడన: రైతు సేవా కేంద్రాల్లో విధులు నిర్వహించే వీఏఏలు, ఎంపీఈఓలు ఈ-క్రాప్, ఈ-పంట నమోదు విషయంలో నిర్లక్ష్యం తగదని, ప్రతి ఎకరం నమోదయ్యేలా చూడాలని పెడన ఏవో ఎస్.జెన్నీ స్పష్టం చేశారు. శుక్రవారం ఆమె తన చాంబరులో మండలంలోని వివిధ ఆర్‌ఎస్‌కేలలో కొత్తగా విధుల్లో చేరిన వీఏఏలతో సమావేశాన్ని నిర్వహించారు. రైతుల సమస్యలపై తక్షణం స్పందించాలన్నారు.